# రణగౌణ తిక్కన్న - వీధిగోడమీద

ఆ యింటి యజమాని పేరు రణగౌణ తిక్కన్న, "రణ" కు "గౌణ" కూడా చేర్చియుండడంచే, యది ఆయన "నిక్‌నేమ్" యని మనం యనుకోవాలి. మఱిన్నీ యసలుపేరు ఈ లోకం మఱచిపోయింది యనికూడా మనం తలపోయాలి. కాకపోతే ఒక మనిషి. ఒకమనిషి కాకపోతే అయినా యసలు పేరుతో పిలువరూ ? "నా" యన్నవాడు కూడా ఆయనగార్ని "రణగౌణ తిక్కన్న" యని సంబోధించడమే. ఆలా పిలిచారని ఆయనకు యభిమానం లేదు, ఆగ్రహం లేదు.

ఏంచేతా యంటే, పూర్వకాలమందు యుద్ధరంగంలో రణతిక్కన్న ఎంతటి కీర్తిగాంచి చన్నాడో, ప్రస్తుతం సాంఘిక వేదికమీద ఈ రణగౌణ తిక్కన యంతటి కలుపుగోలుతనం సంపాదించుకు మననేర్చేడు.

మర్యాదకు మర్యాద, మంచికి మంచి ఇచ్చి, చూపడంలో ఆయన తరువాతనే ఎవర్ని చెప్ప దొరకన్నా: కొందరను కుంటారు గాక, ఆయనకు ఈ పరిచయ ప్రస్తావన యంతా ఆయన భార్యవల్లను అనీ, మఱి కొందఱనుకొందురు గాక, ఆయన ఎడపాదడపా పోసే తేనీరు ఇత్యాది పానీయాల వల్లా, వేసే మెత్త కుర్చీలవల్లా, ఎడతెరపి లేకుండా వ్రాసే ఉత్తరాల వల్లా యని నేనంటాను. అవేమీ కావంటారు.

"వాలైన జడ ఉన్న—మేలైన నడవడి" ఆయన ఇల్లాలిది. మఱిన్నీ చోరుల్నే కాకుండా జారుల్నికూడా పసికట్టి, అరికట్టే స్వభావం వారి యింటి కుక్కపిల్లది. ఆలాంటి

సందర్భంలో మనం రూఢిపఱచుకు తీరవలసిందే. రణగొణ తిక్కన్నగారి యిల్లు, సాంఘిక వ్యవహారాలకు సుతరాం పనికి రాదని. అయితే ఆయన మహా భాగ్యం అది! ఆయన చేసు కున్న పూర్వజన్మ సుకృతమది! మిక్కిలి సాంఘిక వ్యవహర్త యని గణ్యత గాంచేడు.

అందఱికీ వాంఛనీయమే ఆయన్ను ముందుబెట్టుకు, ఆమెతో అనగా ఆయన భార్యతో మాట్లాడుతూ ఉండడం. ఇంత ఇలా సాంఘిక రాయుడూ అయి రణగొణ తిక్కన ప్రవర్తిస్తూ తన యిల్లాలిని ప్రవర్తింపజేస్తూవున్నా ఎందుకో? అతనికీ తప్పిందికాదు, ఒకనాటి వింతచర్య! అయినా ఎంతకాలమని ఉండబట్టుకూరుకోగలడు? మనిషి అయినవాడు? తానెంత సాంఘికవాది అయినా?—

రోజూ సాయంకాలం వాహ్యాళ వెడలి రణగొణ తిక్కన్న తనయింటికి సరిగా 7-30 గంటలకు రాత్రి తిరిగివస్తూ వుండడం పరిపాటి. ఆ వస్తూవుండే సమయానికి ఇంట్లో రేడియో ఏదో ప్లేట్‌పాట పాడుతూ యతగాడికి స్వాగతమివ్వడం, వీధిలో రోడ్డుమీదనుండి ఒకానొక పురుషవ్యక్తి నిశ్శబ్దంగా వీడ్కోలు గొనడం—అనగా చల్లగా జారిపోతూవుండడం. పైకి చూస్తే డాబామీద ఆవిడ, ఇంకా ఆకాశంలోకి చూస్తే కొన్ని చుక్కలూ అవీని!

ఒకరోజున ఈదృశ్యం అంతా సహించలేక, అవతల వ్యక్తిని ఏమని యనుకోడానికి వల్లగాక, భార్యను పిలచి, "చూచావుటే? ఈ దాకాను మనవీధి గోడమీద, తెల్లటి గోడ మీద?" అన్నాడు.

"ఏం ఎవరైనా కిట్టనివాళ్లు ఏమైనా వ్రాశారా? మరకలు గావించారా? మసిపూశారా? ఈ వేళే అవన్నీ గోకించి, తెల్లగా వెల్లవేయించాను కూడాను" యని అంది. "మరకలు మన్ను మశానం అవితే ఫరవాలేదు. మళ్ళీ వెల్ల వేస్తే పోతాయి. నే చూచింది మనిషినీడ" అన్నాడు. మరి ఆ మనిషి ముందుకు నడిచేలో మాయం గాలే ఆ నీడ?" యని అడిగింది ఇల్లాలు. తెల్లబోతూ "మాయమైంది అంటావా?" అంటూ వెంటనే భార్యా సమేతంగా వీధిలోకి వచ్చి నిలిచి దృశ్యం చూచేడు.

ఆవల పురుషుడు ముందుకు సాగి మఠో ఇంటి గుమ్మం ముందు నిలుచుండి, తన నీడచేతను ఆ యింటి తెల్లటిగోడను నలుపు గావిస్తున్నాడు.

"చూచావుటే! నా అడుగుల సవ్వడిలో ముందుకు సాగి ఆ యింటిగోడను పాడుచేస్తూ వున్నాడు. వీణ్ణి తగలెయ్య! వీణ్ణి ఈ వీధిలోకే రాకుండా చేయాలి. వీడికి బొత్తిగా సంఘమర్యాద తెలియదనుకుంటాను" అన్నాడు రణగొణ తిక్కన్న. భార్య "పోనీ, పిల్చి కనుగోండి యతని తాత్పర్య మేమిటో! నిజమే ఇల్లా నీడలు నిలుపుకుంటూ పోతే తెల్లనిగోడల ప్రయోజనం ఏమిటి కనుక, లైట్లు ఉపయోగమేమిటి కనుక" అంది.

ఆవల వ్యక్తిని వెనక్కు పిలవడమా తాము నడచివెళ్ళి ఆవల వ్యక్తిని కలుసుకోవడమా యనే సమస్యలో పడ్డారు భార్యా భర్తలు.

అంతలో ఎవడో దారే పోయేవాడు రణగొణ తిక్కన్న దంపతుల్ని ఇద్దర్నీ బాగా ఎఱిగున్నవాడు "ఏమిటండో! మీ రిద్దఱూ ఇంటితలుపులు అలా బార్లేసుకు వీధిలో నిలబడి

వున్నారు. లోపల ఎవరైనా కొత్తగా ప్రవేశపెట్టారా ?" యని అడిగాడు. "లేదు. పాతరేడియో పౌరాణికుడేనండి" అని సమాధానం చెప్పారే కాని ఆ యిద్దఱుకూడా అసలు సంగతి చెప్పలేదు.

ముందు సాగిన వ్యక్తి వెనక్కు ఒకడుగు వేసి ఈ నూతన వ్యక్తిని కలుసుకుని—ఆ వీధిలో కాపురం ఉండే వాళ్లు యందఱూ వినేలా ఇలా అన్నాడు: "ఇప్పటికి కొన్నాళ్ళ నుంచి వింటూయున్నాను. ఈ వీధిలోని ప్రతియింటా ప్రతియింటి గుమ్మం ముందూ ఈ గంటప్పుడు అన్ని యిళ్ళల్లోనూ ఒకటే పాట ఒకటేపాట వెరైటీ లేదు "మైజానీవాలా"యే! దాని కోసం ఇంటింటా రేడియో ఎందుకు ? అందఱూ ఈ గంటప్పుడు ఓ చోట కూర్చుని వింటే చాలదూ? సాంఘికపు వంటిళ్ళూ, సాంఘికపు పిల్లలబళ్ళూ, అనే ఈ రోజుల్లో ఈ రేడియో గూడుపుఠాణి లేమిటి చెప్పండి: ఏందుకు చెప్పండీ! వట్టి దూబరా యింటివారికి. పైవాడికి నా బోటివాడికి ఎక్కడలేని గాబరా ! ఇంట్లోకి దూరి వినడమా ? వీధిలో దారే వినడమా ? అని మీరూ వినేవుంటారు. అక్కడా "మైజానీవాలా" పాటే ! ఇక్కడా "మైజానీవాలా" పాటే. ముందింట్లో అంతె. మళ్ళీ ఇంట్లోవాళ్లు వింటున్నారా అంటే—ఆడాళ్ళు డాబాలమీద పొరుగిళ్ళ అరుగులమీద, మగాళ్లు "కార్డు ప్లే" కలాపంలోనూ "నో ప్లే" ప్రలాపంలోనూ యని విమర్శించాడు కూడాను యతి ప్రశాంతంగా.

మర్నాటినుంచి రణగొణ తిక్కన్న దంపతులు తమ యింట్లో రేడియో కట్టేశారు, మఱి వారి వీధిగోడమీద నీడలకి నిలుపులూ లేవు—నలుపులూ లేవు.

.... .... .... .... ....